క్లుప్తంగా

వైద్య సిబ్బందికి యోగా శిక్షణ



వైద్య సిబ్బందికి యోగా శిక్షణ ఇస్తున్న యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి యోగా శిక్షణా కార్యక్రమం మంగళవారం ఉదయం జరిగింది. యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ వారితో సూర్య నమస్కారాలు వేయించారు. ప్రతిఒక్కరూ రోజులో కనీసం అరగంట సమయమైనా వ్యాయామం చేయాలని యోగాభ్యాసన చేసిన వైద్యులు సూచించారు. అనంతరం యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు అభినందించారు.

వీరభద్రానికి ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ వీరభద్రం

అమలాపురం టౌన్: స్థానిక కామాక్షీ పీఠం ఆస్థాన సిద్ధాంతి డాక్టర్ కర్రా వీరభద్రానికి ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ ఫెడరేషన్ సంస్థ ఆస్ట్రో అవార్డుతో పాటు జ్యోతిష్య భీష్మ బిరుదును అందించి సత్కరించింది. జ్యోతిష్య, వాస్తు శాస్త్రాల్లో డాక్టర్ వీరభద్రం చూపిస్తున్న ప్రతిభకు గాను అంతర్జాతీయ వేదిక్ ఆస్ట్రాలజీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. న్యూఢిల్లీలో ఈనెల 23న ఆస్ట్రాలజీ ఫెడరేషన్ సంస్థ వీరభద్రానికి అవార్డు, బిరుదు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వేదనభట్ల సాయిలక్ష్మి, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు ఆయనను అభినందించారు.

పిల్లారాయస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో పిల్లారాయస్వామి

యానాం: పట్టణంలో కొలువైన చారిత్రక పిల్లారాయ స్వామి(లక్ష్మీగణపతి) వారి సన్నిధిలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాంగారక చతుర్థి, సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని అర్చకులు మానేపల్లి వీరభద్రశర్మ పర్యవేక్షణలో లక్ష గరిక పూజ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 108 లీటర్ల ఆవుపాలు, విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత శ్రీలక్ష్మికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు అమలాపురానికి చెందిన భక్తురాలు చెక్క శ్రీలక్ష్మి రూ.10,000 విరాళంగా సమర్పించారు. సదరు మొత్తాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి వీరభద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అర్చకులు బ్రహ్మశ్రీ ఉండి దత్తు శర్మ స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దాతకు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

పుదుచ్చేరి ఆర్థికాభివృద్ధికి విఘాతం

యానాం: మధ్యంతర బడ్జెట్‌లు పుదుచ్చేరి ఆర్థికాభివృద్ధికి విఘాతమని మాజీ ఎంపీ ఎం.రామదాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంలో ఎన్ఆర్ కాంగ్రెస్–బీజేపీ కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. గత కొన్నేళ్లుగా మధ్యంతర బడ్జెట్‌లపై వరుసగా ఆధారపడటం వల్ల కేంద్ర పాలితప్రాంతం పుదుచ్చేరి నష్టపోయిందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.12,700 కోట్ల వ్యయం అవుతుందని గత వారం పుదుచ్చేరి ప్రణాళికా బోర్డు అంచనా వేసిందన్నారు. అయితే ఇది పూర్తి స్థాయి బడ్జెట్ కాదని ఈ ఏడాది ఫిబ్రవరి 22న అసెంబ్లీలో ప్రభుత్వం సమర్పించిన రూ.4,634 కోట్ల మధ్యంతర బడ్జెట్‌కు కొనసాగింపు మాత్రమేనన్నారు.

మత్తులో పడితే చిత్తే

- పట్టణంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- యువతే లక్ష్యంగా సాగుతున్న అమ్మకాలు
- నేడు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం



గంజాయితో పట్టుబడిన యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు

యానాం: ప్రతి మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకం. ఆ సమయంలో దుర్వ్యసనాలకు లోనైతే భవిష్యత్తు అంధకారమయమే. అయితే యానాం పట్టణంలో కొందరు స్వార్థపరులు విద్యార్థుల్ని, యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి అమ్మకాలు సాగిస్తుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రశాంత వాతావరణానికి, పర్యాటకానికి నెలవైన యానాం పట్టణం గంజాయి అమ్మకాలకు నిలయంగా మారడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పుదుచ్చేరి పోలీస్‌శాఖ విస్తృత ప్రచారం సాగిస్తుంది. నేడు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

భౌగోళికంగా తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న యానాం ప్రాంతానికి ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి ప్యాకెట్లు రవాణా అవుతున్నాయి. ముఖ్యంగా యానాం సరిహద్దుల్లో ఎటువంటి తనిఖీలు లేకపోవడంతో ఈ తతంగమంతా సాఫీగా సాగిపోతుంది. పలువురు యువకులు గంజాయి కోసం బైక్‌లను ఏజెన్సీ ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ వాటిని అమ్మి తిరిగి వచ్చేటప్పుడు గంజాయి తీసుకు వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఏజెన్సీలో ఉండే బైక్‌లను పోలీసులు సైతం రికవరీ చేయలేకపోతున్నారు. ప్రధానంగా దురలవాట్లకు లోనైనవారు వీలైనంత సులువుగా, వేగంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో గంజాయి విక్రయాలకు తెగబడుతున్నారు. పాఠశాలల, కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. అందుకే తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉంటే మంచిదని పోలీసులు, సామాజికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

యానాం పట్టణంలో ఇదీ పరిస్థితి

✦ సుమారు రెండేళ్ల క్రితం పట్టణంలో గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులను ప్రశ్నించగా తాము ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి కేజీల చొప్పున గంజాయిని తెచ్చి ప్యాకెట్ల రూపంలో మార్చి పాఠశాల, కళాశాల విద్యార్థులకు రహస్యంగా విక్రయాలు జరుపుతున్నట్లు తెలపడంతో అందరినీ విస్మయానికి గురి చేసింది.

✦ భువనేశ్వర్–పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌లో ఇటీవల భారీగా గంజాయిని పుదుచ్చేరి పోలీసులు పట్టుకున్నారు. దీంతో తీగలాగితే డొంకంత కదిలినట్లు దీని లింకు అరకు ప్రాంతంలో ఉందని తెలిసి పుదుచ్చేరి పోలీసులు అక్కడకు వెళ్లి వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు.

✦ గతంలో పట్టణంలోని ఒక యువకుడి ఇంటి పైభాగంలో గంజాయి మొక్కలను పెంచుతున్నారని తెలిసి అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు

తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి



గంజాయిని పూర్తిగా నిర్మూలించడానికి పోలీసు శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ప్రత్యేక క్రైమ్ టీమ్‌లతో నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో నిఘా ఉంచుతున్నాం. కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. యువకులు మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు సైతం వారిపై నిఘా ఉంచాలి

– శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్ఐ, యానాం

పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి

గంజాయి మహమ్మారి పట్టణ ప్రాంతాల నుంచి గ్రామాలకు సైతం పాకడంతో మారుమూల ప్రాంతాల్లో రాత్రివేళల్లో పలువురు యువకులు పక్కదోవ పడుతున్నారు. మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీసులు నిఘా పెంచి గంజాయి రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలి.

– సబ్బతి శ్రీనివాసరావు, గ్రామపెద్ద, దరియాలతిప్ప

✦ కొన్ని నెలల క్రితం యానాం–ఎదుర్లంక బ్రిడ్జి వద్ద గంజాయిని అమ్ముతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించడంతో వారికి పంపిణీ చేస్తున్న మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రయోగాత్మకంగా ఎంటీయూ -1232 రకం సాగు



దొంతికుర్రులో వరి వంగడాన్ని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

కాట్రేనికోన: ఖరీఫ్ సీజన్‌లో ఈదురు గాలులు, వర్షాలను తట్టుకుని రైతులకు అధిక దిగుబడి అందించేందుకు ఎంటీయూ–1232 రకం వరి వంగడాన్ని ప్రయోగాత్మకంగా సాగు చేసేందుకు కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల్లోని దొంతికుర్రు, భీమనపల్లి గ్రామాల్లో రైతులను ఎంపిక చేశామని ఏరువాక శాస్త్రవేత్త ఎం.నందకిషోర్ అన్నారు. నారుమడులు వేసేందుకు అవసరమైన విత్తనాలను రైతులకు వ్యవసాయశాఖ సమకూర్చిందని జిల్లా వనరుల కేంద్రం, అమలాపురం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ అన్నారు. చీడ పీడలు తట్టుకుని 140 రోజుల కాల వ్యవధిలో ఎకరానికి 30–35 బస్తాల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో కాట్రేనికోన ఏఓ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ

యానాం: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని బుధవారం యానాంలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞను నిర్వహించనున్నట్లు పుదుచ్చేరి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(లా అండ్ ఆర్డర్) నర్రా చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



ఐ.పోలవరంలో నిర్వహిస్తున్న నేను బడికి పోతా ర్యాలీ

ఐ.పోలవరం: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ ఎ.మధుసూదనరావు అన్నారు. మంగళవారం ఐ.పోలవరంలో ఏపీసీ ఎ.మధుసూదనరావు, ఏఎంఓ రాంబాబు, ఎంఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో నేను బడికిపోతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ ఎ.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యతోనే భావితరాలకు బంగారు భవిష్యత్ సాధ్యమన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలందరినీ బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని చిన్నారులను ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో తిరుమలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆయుష్ ఆసుపత్రి వద్ద ఉన్న భూముల గురించి చర్చిస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాల్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆయుష్ ఆసుపత్రికి రావాల్సిన బకాయి నిధుల గురించి చర్చించారు. అదేవిధంగా వివిధ నిర్మాణాలకు వ్యవసాయశాఖ నుంచి భూముల బదలాయింపు తదితర అంశాలపై మాట్లాడారు. ఆసుపత్రి వద్ద ఉన్న భూములను పీడబ్ల్యూడీ, రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడికలు తొలగించారు

సాక్షి ఇంపాక్ట్

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామం మీదుగా ప్రవహిస్తున్న అయినాపురం సెక్షన్ పేరాయిచెరువు పంట కాలువలో ఉన్న గుర్రపు డెక్కను మంగళవారం తొలగించారు. పంట కాలువలో గుర్రపు డెక్క పెరిగి మేట వేసి శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవడంతో ఇలాగైతే సాగునీరు సాగేదెలా శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరప్రసాద్ స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం సాగునీరుకు ఆటంకం లేకుండా గుర్రపుడెక్కను తొలగించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పంట కాలువల్లో మేటలు వేసిన ప్రాంతాలను గుర్తించి రైతులకు ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామని ఎంపీడీఓ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు.



ఉప్పలగుప్తం తహసీల్దార్ కార్యాలయం వద్ద పంట కాలువలో గుర్రపుడెక్క తొలగించిన దృశ్యం

వైభవంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం గ్రామ పంచాయతీ శివారు చింతాకులవారిపేటలో వేంచేసియున్న విరాట్ అభయాంజనేయ స్వామివారి ఆలయ ఆరో వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బొడ్డు సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు గుండు బాలకృష్ణ శాస్త్రి, అర్చకులు కిరణ్ శర్మల నేతృత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పలువురు దంపతులచే స్వామివారికి తమలపాకుల పూజ చేశారు. అనంతరం ఆలయం వద్ద గణపతి హోమం, అభయ ఆంజనేయస్వామి వారి హోమం జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. పూజల్లో బొంతు శ్రీనివాస్, రెడ్డి రాము, చీకట్ల మోహన్, కంచి చినసత్యనారాయణ, బొంతు వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డిప్లొమో కోర్సులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

యానాం: 2024–25 విద్యా సంవత్సరానికి యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో భర్తీ కాకుండా ఖాళీగా ఉన్న సీట్లకు బుధవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.దయానాథన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ అండ్ సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో ఖాళీలను బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ భర్తీ చేస్తామన్నారు. కావున యానాంతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



వంతెన నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అల్లవరం: బోడసకుర్రు వద్ద బెండా కెనాల్‌పై ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన్ పథకంలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు పర్యవేక్షణలో జరుగుతున్న నిర్మాణ పనులపై ఆయన ఆరా తీశారు. కాలువపై వంతెన నిర్మాణంతో శివారు ప్రాంతాలకు సాగునీరు ఇబ్బందులు ఏమైనా తలెత్తున్నాయా అని అధికారులను ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి వంతెన శ్లాబ్ పూర్తి చేసిన పీఆర్ అధికారులను అభినందించారు. మిగిలిన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బోడసకుర్రు నుంచి బెండమూర్లంక వరకూ జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్, కార్యదర్శి దుర్గాశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి



ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

తాళ్లరేవు: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని సుంకరపాలెం జంక్షన్ నుంచి కౌలు రైతులు ర్యాలీగా మురమళ్ల క్యాంపు ఆఫీసుకు వెళ్లి నాలుగు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ మండలంలోని రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థలకు సాగునీరు నిలుపుదల చేయాలని, శివారు భూములకు సాగునీటి సమస్య లేకుండా చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దాట్ల సానుకూలంగా స్పందించినట్లు రాజబాబు తెలిపారు. కార్యక్రమంలో రైతులు భజన సత్తిబాబు, పిల్లి సత్యనారాయణ, దడాల వెంకటేశ్వరరావు, సూరంపూడి సూరిబాబు, పేరాబత్తుల సాయి సరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ డేని నిరసిస్తూ కాగడాలతో ఊరేగింపు



కాగడాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అమలాపురం రూరల్: ఎమర్జెన్సీ డేని నిరసిస్తూ అమలాపురంలో బీజేపీ నాయకులు మంగళవారం రాత్రి కాగడాలతో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమర్జెన్సీ రోజుల్లో విద్యార్థి దశలో అరెస్ట్ అయ్యి జైలు జీవితాన్ని గడిపిన ఎమర్జెన్సీ రోజులలో విద్యార్థి దశలో అరెస్టు అయ్యి జైలు జీవితాన్ని గడిపిన ముక్కామల వెంకటశాస్త్రి, నాడిమిల్లి నాగరాజారావు, వల్లూరి విజయానంద పార్థసారథి, పెద్దమల్ల సత్యనందం, దొంగ విజయ్‌కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకట రామ్‌మోహనరావు, మానేపల్లి అయ్యాజీ వేమ, యాళ్ల దొరబాబు, కర్రి చిట్టిబాబు, ఆర్‌వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు 'శ్రవణం నక్షత్రం' అలంకరణ



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో యానాం భూసమేత వేంకటేశ్వర స్వామివారు

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణం నక్షత్రం మంగళవారం రావడంతో అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వేంకటేశ్వర స్వామికిప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న భూసమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆలయ ఈఓ కె.కార్తీక, వరదా శ్రీరామచంద్రమూర్తి సమక్షంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు స్వామి వారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంకన్నకు శ్రవణా నక్షత్ర పూజలు

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆలయ అర్చకులు పెద్దింటి రఘురామవినోదాచార్యులు, పెద్దింటి లక్ష్మణాచార్యులు మంగళవారం శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అనంతరం అలంకరణ, కుంకుమార్చన, తీర్థ ప్రసాదాల వితరణ జరిపారు.

ధాన్యం బిల్లులు తక్షణమే చెల్లించాలి



సీపీఎం కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాల్యాద్రి బలరామ్

అమలాపురం టౌన్: ప్రభుత్వం కౌలు రైతులు అమ్మిన ధాన్యానికి తక్షణమే బిల్లులు చెల్లించాలని సీపీఎం(మార్కిస్ట్) రాష్ట్ర కమిటీ సభ్యుడు అంద్ర మాల్యాద్రి బలరామ్ డిమాండ్ చేశారు. స్థానిక గొల్లగూడెంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకురాలు కె.కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన జిల్లా పార్టీ కమిటీ సమావేశానికి మాల్యాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని పంట కాలువలన్నీ మురుగు డ్రైన్లుగా మారిన క్రమంలో వాటి మరమ్మతులను తక్షణమే చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో గత ఏడు నెలలుగా కూలీలకు వేతనాలు చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. జిల్లాలో ఓఎన్జీసీ తదితర చమురు సంస్థలకు చెందిన గ్యాస్ పైపుల లీకేజీలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కమిటీ ప్రతినిధులు కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, ఎం.బలరామ్, పీతల రామచంద్రరావు, టి.నాగ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కాట్రేనికోన: కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చింతా లోవరాజు, మాగాపు నాగరాజు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చెక్కును ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీఓ కేశవ వర్ధనరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీ, టీడీపీ నాయకులు నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, శీలం అబ్బులు, ఇసుకపట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలో తనిఖీలు



పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెంలోని శ్రీవిద్యాలయ పాఠశాలలో కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి ఎ.మంగాయమ్మ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు విలేకర్లతో మాట్లాడుతూ ఈ పాఠశాల రెండు భవనాల్లో నిర్వహిస్తున్నారని, ఒక భవనానికి సంబంధించి రెగ్యులర్ రిజిస్టర్ లీజ్ డీడ్ లేని కారణంగా ఆ భవనంలో నిర్వహిస్తున్న ఒకటి నుంచి ఎనిమిదో తరగతుల నిర్వహణకు అనుమతి లేదన్నారు. పది రోజుల్లో సంబంధిత పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని, లేకుంటే పిల్లలను వేరే పాఠశాలలకు బదిలీ చేయాలన్నారు. కాకినాడ ఆర్జేడీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించామని, ఈ మేరకు నోటీసు అందజేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి కొబ్బరి మొక్కల పంపిణీ

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి మొక్కలను ఈ నెల 27 నుంచి పంపిణీ చేయనున్నట్లు పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. 2024 సంవత్సరానికి సంబంధించి కొబ్బరి మొక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే పంపిణీ చేస్తామన్నారు. మొక్కల పంపిణీ క్రమ పద్ధతిలో పంపిణీ చేస్తామని రైతులు గుర్తించాలన్నారు